
# ‘బిహార్ దుఃఖదాయని’ అని ఏ నదిని పిలుస్తారు?



ముల్కల రమేష్
సబ్జెక్టు నిపుణులు

జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ
ప్రత్యేకం



## మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో ఏ నది కేవలం భారత్‌లో మాత్రమే ప్రవహిస్తుంది?
1) జీలం 2) సట్లెజ్
3) బియాస్ 4) చీనాబ్

జ: బియాస్

**వివరణ:** బియాస్ నది హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని రోహ్‌తంగ్ కనుమ వద్ద ఉన్న బియాస్ కుండ్ వద్ద జన్మించి, దౌలాధార్ శ్రేణిని చీలుస్తూ, కాంగ్రా లోయ ద్వారా ప్రవహించి పంజాబ్‌లోని ‘హరికే’ వద్ద సట్లెజ్ నదిలో కలుస్తుంది. కాబట్టి ఇది మన దేశ భూభాగంలో మాత్రమే ప్రవహిస్తుంది.

- కానీ ‘జీలం’ నది జమ్మూకశ్మీర్‌లోని ‘వెరినాగ్’ వద్ద జన్మించి, పాకిస్తాన్‌లోని ట్రిమ్ము వద్ద చీనాబ్ నదిలో కలుస్తుంది.
- సట్లెజ్ నది టిబెట్‌లోని మానస సరోవరానికి దగ్గరలోని ‘రాకాసి’ సరస్సు వద్ద జన్మించి, షిప్కిలా కనుమ (హిమాచల్‌ప్రదేశ్) వద్ద మన దేశంలో ప్రవేశించి, పాకిస్తాన్‌లోని ‘మిథాన్‌కోట్’ వద్ద సింధూ నదిలో కలుస్తుంది.
- ‘చీనాబ్’ నది హిమాచల్‌ప్రదేశ్‌లోని బారాలాప్చాలా వద్ద జన్మించి, పాకిస్తాన్‌లోని ‘పంచనాడ్’ వద్ద సట్లెజ్ నదిలో కలుస్తుంది.

2. బ్రహ్మపుత్ర నదిని బంగ్లాదేశ్‌లో ఏమని పిలుస్తారు?
1) పద్మా నది
2) హుగ్లీ నది 3) జమున
4) జమున, మేఘన

జ: జమున, మేఘన

**వివరణ:** బ్రహ్మపుత్ర నదిని ఒక్కొక్క ప్రాంతంలో వేర్వేరు పేర్లతో పిలుస్తారు. చైనాలో యార్లుంగ్ జాంగ్‌పో అని, టిబెట్‌లో త్సాంగ్‌పో అని, అరుణాచల్‌ప్రదేశ్‌లో దిహంగ్, సియాంగ్ అని, అసోంలో సైడాంగ్, బ్రహ్మపుత్ర అని, బంగ్లాదేశ్‌లో గంగా నదిని (పద్మా నది) కలువక ముందు (ఉత్తర బంగ్లాదేశ్‌లో) జమున అని, గంగా నదిని కలిసిన తర్వాత (దక్షిణ బంగ్లాదేశ్‌లో) మేఘన అని పిలుస్తారు.

గంగా నది పశ్చిమ బెంగాల్‌లోని ‘ఫరక్కా’ వద్ద రెండు పాయలుగా చీలి, ఒక పాయ బంగ్లాదేశ్‌లో ప్రవేశించి, పద్మా నది పేరుతో బ్రహ్మపుత్ర నదిలో కలుస్తుంది. మరొక పాయ హుగ్లీ నది పేరుతో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ద్వారా ప్రవహించి ‘సాగర్ దీవుల’ వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.

3. కింది వాటిలో ఏది ప్రత్యక్షంగా ‘గంగా’ నదిలో కలుస్తుంది?
1) సోన్ 2) చంబల్
3) బెట్వా 4) కెన్

జ: సోన్

**వివరణ:** సోన్ నది మధ్యప్రదేశ్‌లోని ‘అమర్ కంటక్’ పీఠభూమిలో జన్మించి, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బిహార్ రాష్ట్రాల ద్వారా ఉత్తరంగా ప్రవహించి పాట్నాలోని దనీపూర్ వద్ద గంగా నదిలో కలుస్తుంది.

- ‘చంబల్’ నది మధ్యప్రదేశ్‌లోని జనపావో కొండల్లోని ‘మౌ’ అనే ప్రదేశంలో జన్మించి, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల గుండా ప్రవహించి చివరగా ఉత్తరప్రదేశ్‌లోని ‘ఇటవా’ జిల్లాలో యమునా నదిలో కలుస్తుంది.
- ‘బెట్వా’ నది మధ్యప్రదేశ్‌లోని ‘భోపాల్’ సమీపంలో జన్మించి, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల గుండా ప్రవహించి, చివరగా ఉత్తరప్రదేశ్‌లోని ‘హమీద్‌పూర్’ వద్ద యమునా నదిలో కలుస్తుంది.
- కెన్ నది మధ్యప్రదేశ్‌లోని ‘కైమూర్ కొండల్లో’ జన్మించి, బుందేల్‌ఖండ్ పీఠభూమి గుండా ప్రవహించి, చివరగా ‘బాండ’ వద్ద యమునా నదిలో కలుస్తుంది.

4. కింది వాటిలో ఏ రెండు నదులు ఒకే ప్రదేశంలో జన్మిస్తున్నాయి?
1) గంగా, సింధూ
2) గంగా, యమునా
3) సింధూ, జీలం 4) సట్లెజ్, సింధూ

జ: సట్లెజ్, సింధూ

**వివరణ:** సింధూ నది టిబెట్‌లోని మానస సరోవరం వద్ద ఉన్న గర్తాంగ్‌చూ నుంచి ప్రారంభం కాగా, అదే మానస సరోవరం వద్ద ఉన్న రాకాసి సరస్సు వద్ద సట్లెజ్ నది జన్మిస్తుంది.

- గంగానది ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని దేవ ప్రయాగ వద్ద అలకనంద, భగీరథి కలవడం వల్ల ఏర్పడుతుంది.
- జీలం నది జమ్మూ కశ్మీర్‌లోని వెరినాగ్ వద్ద జన్మించగా, యమునా నది ఉత్తరాఖండ్‌లోని భండార్ పుంచ్ పర్వత శిఖరం వద్ద ఉన్న యమునోత్రి అనే హిమానీ నదం వద్ద జన్మిస్తుంది.

5. ‘బిహార్ దుఃఖదాయని’ అని ఏ నదిని పిలుస్తారు?
1) దామోదర్ నది 2) కోసి నది
3) బ్రహ్మపుత్ర నది 4) గండక్ నది

జ: కోసి నది

**వివరణ:** కోసి నదిని బిహార్ దుఃఖదాయని అని, దామోదర్ నదిని బెంగాల్ దుఃఖదాయని అని, బ్రహ్మపుత్రను అసోం దుఃఖదాయని అని పిలుస్తారు.

6. కింది వాటిలో తూర్పు కనుమలలో జన్మించని నది ఏది?
1) నాగావళి
2) వంశధార 3) మాచ్‌ఖండ్
4) దామోదర్ నది

జ: దామోదర్ నది

**వివరణ:** దామోదర్ నది జార్ఖండ్ రాష్ట్రంలోని చోట్ నాగపూర్ పీఠభూమిలోని ‘టోరి’ అనే ప్రాంతంలో జన్మిస్తుంది.

- కానీ మిగిలిన మూడు నదులు తూర్పు కనుమల్లో జన్మిస్తాయి.
- వంశధార ఒడిశా రాష్ట్రంలోని ‘జయపూర్’ కొండల్లో జన్మిస్తుంది.
- నాగావళి నది ఒడిశా రాష్ట్రంలోని ‘రాయ్‌ఘడ్’ కొండల్లో జన్మిస్తుంది.
- మాచ్‌ఖండ్ నది ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లాలోని ‘గూడెం’ వద్ద జన్మిస్తుంది.

7. కింది వాటిలో భిన్నమైంది ఏది?
1) కపిలధార జలపాతం
2) డుడుమా జలపాతం
3) సహస్ర్తధార జలపాతం
4) ధ్రువనధార జలపాతం

జ: డుడుమా జలపాతం

**వివరణ:** డుడుమా జలపాతం మాచ్‌ఖండ్ నదిపై ఆంధ్రప్రదేశ్ ఒడిశా సరిహద్దులలో ఉంది.

కానీ మిగిలిన మూడు జలపాతాలు నర్మదా నదిపై ఉన్నాయి.

8. తూర్పుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలిసే నదులను దక్షిణం నుంచి ఉత్తరానికి అమర్చండి.
1) పెన్నా నది, కావేరి నది, గోదావరి, మహానది
2) మహానది, గోదావరి, పెన్నా నది, కావేరి నది
3) కావేరి నది, గోదావరి, మహానది, పెన్నా నది
4) కావేరి నది, పెన్నా నది, గోదావరి, మహానది

జ: కావేరి నది, పెన్నా నది, గోదావరి, మహానది

**వివరణ:** కావేరి నది అత్యంత దక్షిణంగా ప్రవహించి చివరగా తమిళనాడులోని కావేరి పట్నం వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.

- పెన్నా నది కావేరి నదికి ఉత్తరంగా అంటే ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా గుండా ప్రవహించి చివరగా ఊటూకూర్ వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.
- గోదావరి నది పెన్నా నదికి ఉత్తరంగా అంటే ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దు గుండా ప్రవేశించి, సముద్రంలో కలిసే ముందు 7 పాయలుగా విడిపోయి రాజమండ్రికి దిగువన అంతర్వేది, నర్సాపూర్ మధ్య భాగంలో బంగాళాఖాతంలో కలుస్తుంది.
- మహానది గోదావరి నదికి ఉత్తరంగా అంటే ఒడిశా రాష్ట్రం గుండా ప్రవహించి చివరగా ఒడిశా రాష్ట్రంలోని ‘నారాజ్’ అనే ప్రాంతంలో బంగాళాఖాతంలో కలుస్తుంది.

9. కింది వాటిలో నర్మదా నదిపై నిర్మించిన ప్రాజెక్టు ఏది?
1) ఇందిరా సాగర్ ప్రాజెక్టు
2) భాక్రానంగల్ ప్రాజెక్టు
3) తెహ్రీ డ్యాం
4) హీరాకుడ్ ప్రాజెక్టు

జ: ఇందిరా సాగర్ ప్రాజెక్టు

- ఈ ప్రాజెక్టును నర్మదా నదిపై గుజరాత్‌లోని ‘పూర్ణసా’ ప్రాంతంలో నిర్మించారు.
- భాక్రానంగల్ ప్రాజెక్టును సట్లెజ్ నదిపై నిర్మించారు.
- తెహ్రీ డ్యాంను భగీరథి నదిపై ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నిర్మించారు.
- హీరాకుడ్ ప్రాజెక్టును ఒడిశా రాష్ట్రంలో మహానదిపై నిర్మించారు. ఇది భారత దేశంలో అతి పొడవైన ప్రాజెక్టు.

10. కింది వాటిలో అంతర్జాతీయ ప్రాజెక్టు ఏది?
1) చంబల్ ప్రాజెక్టు
2) గండక్ ప్రాజెక్టు
3) బియాస్ ప్రాజెక్టు
4) సర్దార్ సరోవర్ ప్రాజెక్టు

జ: గండక్ ప్రాజెక్టు

వివరణ: ఈ ప్రాజెక్టు వల్ల మన దేశంలోని బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు, నేపాల్ దేశం లబ్ధి పొందుతున్నాయి. కాబట్టి ఇది అంతర్జాతీయ ప్రాజెక్టు.

కానీ చంబల్ ప్రాజెక్టు వల్ల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు, బియాస్ ప్రాజెక్టు వల్ల పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌లు సర్దార్ సరోవర్ ప్రాజెక్టు వల్ల గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లు లబ్ధి పొందుతున్నాయి. కాబట్టి ఇవి అంతర్జాతీయ ప్రాజెక్టులు కావు.

11. కింది వాటిలో ఏ నదిని అంతర్భూభాగ నది అని పిలుస్తారు?
1) శరావతి
2) మహీ నది
3) లూని
4) పంబియార్

జ: లూని

వివరణ: సముద్రంలో కలవడానికి బదులుగా ఉప్పు నీటి సరస్సులో కానీ లేదా ఇసుక రేణువులలో గాని అంతం అయ్యే నదిని అంతర్భూభాగ నది అంటారు. లూని నది రాజస్థాన్ రాష్ట్రంలోని ‘అన్నా సాగర్’ సరస్సు వద్ద జన్మించి, గుజరాత్ రాష్ట్రంలోని రాణా ఆఫ్ కచ్ ప్రాంతంలో అంతం అవుతుంది.

## భారతదేశంలోని సరస్సులు:

- భారతదేశంలోని అతిపెద్ద మంచి నీటి సరస్సు – **ఉలార్ సరస్సు (జమ్మూ కశ్మీర్)** భారతదేశంలోని అతిపెద్ద ఉప్పునీటి సరస్సు – **సాంబార్ (రాజస్థాన్)**
- భారతదేశంలోని అతిపొడవైన ఉప్పునీటి సరస్సు – **చిల్కా (ఒడిశా)**
- భారతదేశంలోని ఎత్తైన సరస్సు – **లోక్‌తక్ సరస్సు (మణిపూర్)**
- భారతదేశంలోని ఏకైక అగ్ని పర్వత సరస్సు – **లోనార్ సరస్సు (మహారాష్ట్ర)**
- భారతదేశంలోని సరస్సుల నగరం – **ఉదయపూర్ (రాజస్థాన్)**

| సరస్సులు | రాష్ట్రాలు / కేంద్ర పాలిత ప్రాంతాలు |
|---|---|
| 1) పుష్కర్ | రాజస్థాన్ |
| 2) ఉదయపూర్ | రాజస్థాన్ |
| 3) సాంబార్ | రాజస్థాన్ |
| 4) అన్నా సాగర్ | రాజస్థాన్ |
| 5) ఆనంద్ సాగర్ | రాజస్థాన్ |
| 6) సర్దార్ సమంద్ | రాజస్థాన్ |
| 7) రాజా సమంద్ | రాజస్థాన్ |
| 8) పిచోలా | రాజస్థాన్ |
| 9) జై సమంద్ | రాజస్థాన్ |
| 10) ఉలార్ | జమ్మూ కశ్మీర్ |
| 11) దాల్ | జమ్మూ కశ్మీర్ |
| 12) పాంగాంగ్‌త్సో | లద్దాఖ్ |
| 13) త్సోమోరారీ | లద్దాఖ్ |
| 14) నైనిటాల్ | ఉత్తరాఖండ్ |
| 15) భీమ్‌టాల్ | ఉత్తరాఖండ్ |
| 16) గోహ్నా | ఉత్తరాఖండ్ |
| 17) బారా సాగర్ | ఉత్తరప్రదేశ్ |
| 18) గోవింద్ వల్లభ పంత్ సాగర్ | ఉత్తరప్రదేశ్ |
| 19) రూప్‌కుండ్ | ఉత్తరప్రదేశ్ |
| 20) బేలా సాగర్ | ఉత్తరప్రదేశ్ |
| 21) లోనార్ క్రేటర్ | మహారాష్ట్ర |
| 22) వెన్నా | మహారాష్ట్ర |
| 23) శివసాగర్ | మహారాష్ట్ర |
| 24) చిల్క | ఒడిశా |
| 25) బిందు సరోవర | ఒడిశా |
| 26) సాల్ట్ సరస్సు | పశ్చిమ బెంగాల్ |
| 27) అష్టముడి | కేరళ |
| 28) వెంబనాడ్ | కేరళ |
| 29) నాల్ సరోవర్ | గుజరాత్ |
| 30) నారాయణ్ సరోవర్ | గుజరాత్ |
| 31) నాకో | హిమాచల్ ప్రదేశ్ |
| 32) లోక్‌తక్ | మణిపూర్ |
| 33) సుఖ్నా | చండీగఢ్ |
| 34) పరశురాం కుండ్ | అరుణాచల్ ప్రదేశ్ |

| నది | మరో పేరు/ పేర్లు |
|---|---|
| 1) బెట్వా నది | నేత్రావతి |
| 2) కెన్ | కర్ణావతి |
| 3) సోన్ | సువర్ణ నది |
| 4) గండక్ | నారాయణ్ (బిహార్‌లో) |
| 5) గోదావరి | దక్షిణ గంగ, వృద్ధ గంగ, ఇండియన్ రైన్ |
| 6) నాగావళి | లాంగ్యులా |
| 7) నర్మద నది | మార్బుల్ రివర్, పగులులోయ నది |
| 8) సబర్మతి | గిరి కర్ణిక (పురాతనపేరు) |
| 9) లూనీ నది | సాల్ట్ రివర్ |
| 10) జీలం నది | వితస్త (ప్రాచీన నామం) |
| 11) చీనాబ్ నది | అస్కిని (ప్రాచీన నామం) |
| 12) రావి నది | పరూష్ని (ప్రాచీన నామం), ఐరావతి, లాహోర్ నది |
| 13) బియాస్ నది | విపాస (ప్రాచీన నామం) |
| 14) సట్లెజ్ నది | శయద్రి (ప్రాచీన నామం) |
| 15) బ్రహ్మపుత్ర | యార్లుంగ్ జాంగ్ పో (చైనా) త్సాంగ్‌పో(టిబెట్‌లో) దిహంగ్, సియాంగ్ (అరుణాచల్‌ప్రదేశ్‌లో) సైడాంగ్, రెడ్ రివర్ (అసోం), జమున (ఉత్తర బంగ్లాదేశ్‌లో) మేఘన (దక్షిణ బంగ్లాదేశ్‌లో) |
| 16) గంగా నది | జాహ్నావి నది |